
# చుట్టుపాలెం లో వైభవంగా సీతారాముల కల్యాణం




నెల్లూరు జిల్లా రాపూరు(బిఎన్ఎస్):-నెల్లూరు జిల్లాలోని రాపూరు మండలంలోని మునగాల వెంకటాపురం పంచాయతీ పరిధిలోని చుట్టుపాలెం గ్రామంలో శ్రీశ్రీశ్రీ సీతారాముల దేవాలయం నిర్మాణం అనంతరం మొదటి వార్షికోత్సవం సందర్భంగా స్వామి వార్లకు ఉదయం అభిషేకం, మరియు విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులకు మంగళ వాయిద్యలతో వేదపండితులు మద్య భక్తుల "జై శ్రీరామ్"నామ స్మరణతో అత్యంత వైభవంగా నిర్వహించారు.కార్యక్రమంలో చుట్టుపాలెం గ్రామస్తులు మరియు రాపూరు పి.ఎ.సి.యస్. డైరెక్టర్ చింకర్ల రామయ్య యాదవ్ మాట్లాడుతూ సీతారాముల దేవస్థానం నిర్మాణం అనంతరం శిలా ప్రతిష్ట మరియు కుంభాభిషేకం అనంతరం మొదటి వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్తులు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించమని సాయంత్రం స్వామి వార్ల గ్రామోత్సవం కార్యక్రమంకూడా వైభవంగా జరుగుతుంది అని తెలిపారు.

# వెంకటగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మూడు పూటలా ఉచిత భోజన పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీ కురుగొండ్ల రామకృష్ణ



ఉమ్మడి నెల్లూరు జిల్లా వెంకటగిరి(బి.యన్.యస్):-వెంకటగిరి సామాజిక ఆరోగ్య కేంద్రంలో (ప్రభుత్వ ఆసుపత్రిలో) చికిత్స పొందుతున్న రోగులకు ఉచిత భోజన వసతి కార్యక్రమాన్ని వెంకటగిరి శాసనసభ్యులు కురుగొండ్ల రామకృష్ణ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని రోగులకు స్వయంగా భోజనం వడ్డించారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందితో, రోగులతో ఆయన మాట్లాడారు.అనంతరం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆసుపత్రులను నిర్లక్ష్యం చేశారని, రోగులకు సరైన భోజన సదుపాయాలు కూడా కల్పించలేదని ఆయన విమర్శించారు.

ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ మరియు శ్రీ నారా లోకేష్ బాబు ల నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు. అదేవిధంగా

ఆసుపత్రిలో అడ్మిట్ అయిన రోగులు బయట ఆహారం కొనుక్కోవాల్సిన అవసరం లేకుండా, నేటి నుంచి ఆసుపత్రిలోనే ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో మూడు పూటలా నాణ్యమైన ఉచిత భోజనాన్ని అందించనున్నట్లు ఆయన ప్రకటించారు.

ఈ భోజనంతో పాటు రోగులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం గుడ్డు, అరటిపండు, మరియు పల్లి పట్టీలు (చిక్కీలు) అందజేస్తామని తెలిపారు.అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రులలో బయట దొరకని మందులు కూడా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, అర్హత కలిగిన నైపుణ్యమున్న డాక్టర్లు ఇక్కడ అందుబాటులో ఉన్నారని ఆయన పేర్కొన్నారు.ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రులను చిన్నచూపు చూడకుండా, ఇక్కడ అందుబాటులో ఉన్న నాణ్యమైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.అదేవిధంగా గత ప్రభుత్వం నిలిపివేసిన అన్నా క్యాంటీన్లను పేదల ఆకలి తీర్చడం కోసం ఈరోజు రాష్ట్రవ్యాప్తంగా 269 క్యాంటీన్లను ప్రభుత్వం తిరిగి ప్రారంభించి, కేవలం 5 రూపాయలకే భోజనం అందిస్తోందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు.

# జాతీయ అవయవ దానం దినోత్సవం



నల్లగొండ (బీఎన్ఎస్): విషాదంలోనూ మానవత్వాన్ని చాటిన అవయవదాతల కుటుంబాలు మానవత్వానికి నిలువెత్తు నిదర్శనమని నల్లగొండ జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు.. జాతీయ అవయవదాన దినోత్సవం సందర్భంగా జిల్లాలో అవయవ దానం చేసిన కుటుంబ సభ్యుల ను లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ చారిటబుల్ ట్రస్ట ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో హృద్యమైన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ గారు అవయవదాన ప్రతిజ్ఞ పత్రంపై సంతకం చేసి, అవయవదానం పట్ల తన సంపూర్ణ మద్దతును తెలియజేశారు... అవయవదానం ద్వారా పలువురికి పునర్జన్మ ప్రసాదించిన తొమ్మిది మంది అవయవదాతల కుటుంబాలను ప్రత్యేకంగా రూపొందించిన "కృతజ్ఞతా పూర్వక" ప్రశంసా పత్రాలతో సత్కరించారు..

అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... అత్యంత విషాద సమయంలో కూడా తమ ప్రియమైన కుటుంబ సభ్యుల అవయవాలను దానం చేయడానికి అంగీకరించిన ఈ కుటుంబాలు నిజమైన మానవతా మూర్తులని అన్నారు.. ఒకరి అవయవ దానం వల్ల కనీసం ఐదుగురి జీవితాలనైనా కాపాడవచ్చని, అందుకే అవయవదానం పట్ల సమాజంలో మరింత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.. .

# గోదావరి వరదలతో లంక గ్రామాలు అతలాకుతలం



అమలాపురం(బీఎన్ ఎస్ ) ఆగస్టు 3: కోనసీమ జిల్లాలో గోదావరి వరదలు లంక గ్రామాలను తీవ్రంగా అతలాకుతలం చేశాయి. ఎగువ ప్రాంతాల్లో వరద ఉధృతి తగ్గుముఖం పట్టినప్పటికీ, లంక ప్రాంతాల్లో ఇంకా వరద నీరు పూర్తిగా తగ్గకపోవడంతో అనేక గ్రామాలు జలదిగ్బంధంలోనే ఉన్నాయి. రహదారులు నీటమునిగిపోవడం, పలు చోట్ల రవాణా వ్యవస్థ దెబ్బతినడంతో లంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు పూర్తిగా పునరుద్ధరించబడలేదుప్రజలు పడవలపైనే రాకపోకలు సాగిస్తూ నిత్యావసర వస్తువులు, వైద్య సేవలు, ఇతర అవసరాల కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ వరదల కారణంగా జిల్లాలోని ఐనవిల్లి, ముమ్మిడివరం, ఐ. పోలవరం, గన్నవరం, కొత్తపేట, రాజోలు మండలాల పరిధిలోని లంక గ్రామాల్లో సాగు చేసిన వేలాది ఎకరాల విలువైన కూరగాయల పంటలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. టమాటా, బెండ, వంకాయ, మిరప, దోసకాయ, కాకర, బీరకాయ, గుమ్మడికాయ వంటి అధిక విలువ కలిగిన కూరగాయల పంటలు వరద నీటిలో మునిగిపోయాయి. ఇప్పటికే కోతకు సిద్ధంగా ఉన్న పంటలు కూడా నీటిపాలవడంతో రైతులు పెట్టుబడులతో పాటు ఆశించిన ఆదాయాన్ని పూర్తిగా కోల్పోయారు.

కూరగాయలతో పాటు కొబ్బరి, అరటి, చెరకు, పసుపు తదితర వాణిజ్య పంటలు కూడా భారీగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా కోటిపల్లి లంక ప్రాంతంలో సుమారు 1,200 ఎకరాల్లో సాగు చేసిన వివిధ కూరగాయల పంటలు, వాణిజ్య పంటలు వరద నీటిలో మునిగి పూర్తిగా నాశనమయ్యాయి. దీంతో రైతులకు కోట్ల రూపాయల మేర ఆర్థిక నష్టం సంభవించినట్లు అంచనా వేస్తున్నారు. అప్పులు చేసి సాగు చేసిన రైతులు ఇప్పుడు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

వరద నీటి ఉధృతి కారణంగా అనేక లంక గ్రామాల్లో సారవంతమైన వ్యవసాయ భూములు నేలకోత (సాయిల్ ఎరోషన్)కు గురయ్యాయి. పంట పొలాల్లో ఇసుక మేటలు పేరుకుపోవడంతో భూముల సారవంతత దెబ్బతిందని రైతులు చెబుతున్నారు. సాగుకు అనువైన భూములు క్రమంగా తగ్గిపోతుండటంతో భవిష్యత్తులో వ్యవసాయం ఎలా చేయాలన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది.

# పీజీఆర్ఎస్‌పై ప్రజల్లో నమ్మకాన్ని పెంచాలి..!

## జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

## ఎల్‌నినో ప్రభావం, ప్రత్యామ్నాయ చర్యలపై ప్రజల్లో అవగాహన పెంచాలి



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 03:

ప్రజా సమస్యల పరిష్కారంలో నాణ్యత, పారదర్శకతతో పాటు ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని... ఎల్‌నినో వాతావరణ మార్పులు, ప్రత్యామ్నాయ చర్యలపై. రైతులు, ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సభాభవన్ లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.. జేసీ డా. నిధి మీనా తోకలిసి ప్రజల నుంచి నేరుగా వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజల నుంచి అందిన ప్రతి అర్జీని క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్న తర్వాతే తగిన పరిష్కారం చూపాలని సూచించారు. అర్జీల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. పిజిఆర్ఎస్ వ్యవస్థపై అధికారులు పారదర్శకంగా వ్యవహరిస్తూ.. ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. ప్రజల్లో పీజీఆర్ఎస్ ద్వారా పరిష్కరించిన ఫిర్యాదులపై ప్రజల అభిప్రాయం ప్రభుత్వానికి ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పీజీఆర్ఎస్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. అలాగే ప్రజలు తమ ఫిర్యాదుల స్థితిగతులను టోల్‌ఫ్రీ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు. తహసీల్దార్లు, శాఖాధిపతులు, పీజీఆర్ఎస్ సిబ్బంది ప్రజలకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు.

ఎల్ నినో ప్రభావంపై ప్రజల్లో అవగాహన పెంచాలి..

ఎల్‌నినో ప్రభావంతో వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ చర్యలు, ఈ ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ సాగు విధానాలపై జిల్లా ప్రజలు, రైతుల్లో అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. వాతావరణ మార్పులు అనుగుణంగా పంటల సాగు, ప్రకృతి వ్యవసాయ విధానాలు, సేంద్రియ ఎరువుల వినియోగం, భూగర్భ జలాల సంరక్షణ, భూతాపాన్ని తగ్గించే చర్యలు, సాగు మరియు తాగునీటి పొదుపు వంటి అంశాలపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని రైతులు, ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఇందుకోసం నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో మల్లికార్జునుడు, జెడ్పీ సీఈవో సుబ్రహ్మణ్యం, ఎస్డీసీ వెంకటపతి, డిప్యూటీ కలెక్టర్లు జాన్ ఇర్విన్, రంగస్వామి, శివ రామిరెడ్డి, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ అనురాధ, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హుడికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందేలా నిరంతరం కృషి...!!



రావులపాలెం (బీఎన్ఎస్)ఆగస్టు :3 ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పేద ప్రజలకు కష్టకాలంలో అండగా నిలవాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం పారదర్శకంగా, వేగవంతంగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. సోమవారం రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని చెక్కులను అందజేశారు. పేదలు ఆరోగ్యపరంగా వైద్యానికి ఖర్చు పెట్టుకుని ఇబ్బందుల్లో ఉన్నారు, వారికి ఆర్థికంగా సహాయం చేయాలని కోరగానే ముఖ్యమంత్రి చంద్రబాబు వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి అందజేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి నెలా రూ.50 లక్షల వరకు ఆర్థిక సహాయం సీఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా మన నియోజకవర్గంలో జరుగుతుందన్నారు. ఇంకా రావాల్సినవి కూడా ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హుడికి సీఎంఆర్ఎఫ్ ద్వారా సహాయం అందేలా నిరంతరం ప్రభుత్వ దృష్టికి తీసుకెళు _న్నామని, ప్రజల సంక్షేమం విషయంలో ఎలాంటి రాజీ ఉండదన్నారు.

# గండికోట థీమ్ తో కొత్త టెర్మినల్ డిజైన్ తో కడప ఎయిర్ పోర్ట్.!!

బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 03:




గండికోట థీమ్ ఆకారంలో కడప ఎయిర్పోర్ట్ నూతన హంగులతో టెర్మినల్ డిజైన్

కొత్త లుక్ లోకి మారనుంది.

సుమారు 266 కోట్లతో రెండో టెర్మినల్ నిర్మాణం శరవేగంగా గండికోట థీమ్ తో ఆకట్టుకునేలా కొత్త టెర్మినల్ డిజైన్ తో కడప ఎయిర్ పోర్ట్ దాదాపు 70 శాతం నిర్మాణ పనులు పూర్తి కావడం జరిగింది.

2027 జనవరి నాటికి కొత్త టెర్మినల్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ క్రమంలో రన్‌వే, అభివృద్ధి తోపాటు ఇకమీదట విమాన సర్వీసులను నైట్ ల్యాండింగ్‌కు సన్నాహాలు చేస్తున్నారు. దీనితో భవిష్యత్తులో మరిన్ని దేశీయ విమాన సర్వీసులకు అవకాశం ఏర్పడనుంది.

ప్రస్తుతం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, వారణాసికి రెగ్యులర్ విమాన సర్వీసులు అందుబాటులో ఉన్నవి. ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలతో కొత్త టెర్మినల్ నిర్మాణం శర వేగంగా పనులు జరుగుతున్నాయి.

రాయలసీమ వైభవాన్ని ప్రతిబింబించేలా గండికోట కాన్సెప్ట్‌తో కడప ఎయిర్ పోర్ట్ రెండో టర్మినల్ నిర్మాణం జరగనుంది. దీనితో కడపజిల్లా ప్రజలకు మరింతగా విమాన సర్వీసులు అందుబాటులో ఉంటాయని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# ముదిరాజ్‌ల ఐక్యతే లక్ష్యం

## నూతన సంఘం సభ్యుల మర్యాదపూర్వక భేటీలు

## అధ్యక్షుడు చిన్న ముదిరాజ్, జనరల్ సెక్రటరీ భీమని రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమం

## మాజీ కార్పొరేటర్ నీలం రవీందర్ ముదిరాజ్‌కు ఘన సత్కారం

## తెల్లాపురం శ్రీనివాస్ రాజ్ ముదిరాజ్‌తో సమావేశం





శేరిలింగంపల్లి (బిఎన్ఎస్): ముదిరాజ్‌ల ఐక్యత, సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా శేరిలింగంపల్లిలో నూతనంగా ఏర్పాటైన ముదిరాజ్ సంఘం ముందుకు సాగుతోంది. సంఘం అధ్యక్షుడు చిన్న ముదిరాజ్, జనరల్ సెక్రటరీ భీమని రవీందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు పలువురు ముదిరాజ్ ప్రముఖులను మర్యాదపూర్వకంగా కలిసి సంఘం లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణను వివరిస్తున్నారు.

ఇందులో భాగంగా శేరిలింగంపల్లి మాజీ కార్పొరేటర్ నీలం రవీందర్ ముదిరాజ్ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి నూతన సంఘం ఏర్పాటు, లక్ష్యాలు, చేపట్టబోయే కార్యక్రమాల గురించి వివరించారు.

ముదిరాజ్ సమాజాన్ని మరింత సంఘటితం చేయడం, యువతకు అవకాశాలు కల్పించడం, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం, సమాజంలోని సమస్యల పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయడం వంటి అంశాలపై చర్చించారు. సంఘం మరింత బలోపేతం అయ్యేలా తన సహకారం, సలహాలు, మార్గదర్శనం అందించాలని నీలం రవీందర్ ముదిరాజ్‌ను కోరారు.

అనంతరం తెల్లాపురం శ్రీనివాస్ రాజ్ ముదిరాజ్ను కూడా అధ్యక్షుడు చిన్న ముదిరాజ్, జనరల్ సెక్రటరీ భీమని రవీందర్ ముదిరాజ్‌తో పాటు సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. నూతన సంఘం లక్ష్యాలు, భవిష్యత్ కార్యాచరణ, ముదిరాజ్ సమాజ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయనతో చర్చించారు.

సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకొని, ముఖ్యంగా యువతను ప్రోత్సహిస్తూ ముదిరాజ్‌ల ఐక్యత, సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సామాజిక అభివృద్ధి కోసం ఐక్యంగా పనిచేస్తామని సంఘం అధ్యక్షుడు చిన్న ముదిరాజ్, జనరల్ సెక్రటరీ భీమని రవీందర్ ముదిరాజ్ పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో నూతన ముదిరాజ్ సంఘం కార్యవర్గ సభ్యులు, సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

